చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- కోడూరు, మందపాకల సచివాలయం, ఆర్‌బీకే భవనాల ప్రారంభం
- రూ.133.48 లక్షలతో అభివృద్ధి పనులు


కోడూరు-1 ఆర్‌బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యమిస్తూ, చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి కార్యక్రమాలు చేశారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలో నిర్మించిన కోడూరు-1, మందపాకల సచివాలయం, ఆర్‌బీకే భవనాలను రమేష్‌బాబు శుక్రవారం ప్రారంభించారు. కోడూరు-1 సచివాలయం వద్ద ఎంపీడీఓ శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో రమేష్‌బాబు మాట్లాడారు.
రెండేళ్లు కోవిడ్ విపత్కర పరిస్థితులు తలెత్తినా సంక్షేమ పథకాలను ప్రజలకు అనుకున్న సమయానికి అందించామని చెప్పారు. గతంలో పెన్షన్లు, ఇళ్ల స్థలాలు కోసం ప్రజలు జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వలంటీర్లే ఇళ్లకు వచ్చి పథకాలు అందిస్తున్నారన్నారు. విద్యా, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామన్నారు.

■ చేసిన అభివృద్ధి కనిపించడం లేదా..
గ్రామస్థాయిలో సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటరులు, డిజిటల్ లైబ్రరీలు, మల్టీపర్పస్ సెంటర్లు నిర్మించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని రమేష్‌బాబు అన్నారు. ఇదంతా అభివృద్ధి కాదా అని ప్రతిపక్షాలను ప్రశ్నించారు. ప్రజలు మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా గ్రామంలోనే అన్ని కార్యాలయలను నిర్మించి, అందులో లక్షలాది మందికి ప్రభుత్వ కొలువులు కల్పించినట్లు రమేష్‌బాబు చెప్పారు. తమ పాలనపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

■ 133.48లక్షలతో అభివృద్ధి
కోడూరు-1, మందపాకల సచివాలయాల పరిధిలో రూ.133.48లక్షల అంచనాతో నిర్మించిన రెండు సచివాలయాలు, రెండు ఆర్‌బీకే భవనాలను రమేష్‌బాబు ప్రారంభించారు. శిలాఫలకాలను ఆవిష్కరించి, శాస్త్రోక్తంగా పూజలు చేశారు. భవనాలను పరిశీలించి, సచివాలయ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. పార్టీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ యాదవ రెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచి వెన్నా షైనీ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, మీసాల రాణినాంచారమ్మ, ముక్కు వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు చిట్టిప్రోలు బ్రహ్మారావు, పూలేంద్రరరావు పాల్గొన్నారు.

త్వరలో కోడూరు-అవనిగడ్డ రహదారి పనులు

కోడూరు: కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. శుక్రవారం కోడూరులో జరిగిన సచివాలయాల ప్రారంభోత్సవ సభలో రమేష్‌బాబు మాట్లాడారు. కోడూరు-అవనిగడ్డ రహదారి నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా ప్రభుత్వం టెండర్ పిలిచిందని, ఈ నెల 23న టెండర్‌ను ఖరారు చేస్తారని రమేష్‌బాబు చెప్పారు. వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. అవనిగడ్డ సభలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నేరవేరుస్తున్నామని చెప్పారు. అవనిగడ్డలో డయాలసిస్ సెంటర్ ప్రారంభించామని, నిషేదిత భూముల సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. ఎదురుమొండి వారధి నిర్మాణానికి నాబార్డు సంస్థ నిధులు కేటాయించిందని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. డంపింగ్ యార్డు నిర్మాణానికి ప్రయత్నిస్తుంటే ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని రమేష్‌బాబు మండిపడ్డారు.

వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

బందలాయిచెరువు(అవనిగడ్డ): మండల పరిధిలోని బందలాయిచెరువులో రూ.28.60లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా 143 రకాల మందులు , పలు రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందిస్తారని చెప్పారు. ఈ కేంద్రం ఏర్పాటుకు గ్రామానికి చెందిన కమ్మిలి కృష్ణమూర్తి జ్ఞాపకార్థం భార్య బసవపున్నమ్మ, కుమారుడు రాజా ఉచితంగా స్థలం అందించారు. ఈ సందర్భంగా దాతలను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, సర్పంచ్ గొరుముచ్చు ఉమ, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీడీవో మరియాదేవి, ఈవోపీఆర్‌డీలు శైలజాకుమారి, సుందరి, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రథసప్తమి



మచిలీపట్నంటౌన్: రథసప్తమి వేడుకలు నగరంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలోని సూర్య భగవానునికి 508 కలశాలతో క్షీరాభిషేకాలు చేశారు. చిట్టిపిళ్లారయ్య ఆలయంలో సూర్య భగవానునికి ఆరాధన, నమస్కారాలు, స్తుతి, ఆదిత్య హృదయపారాయణ, నీరాజనం, మంత్రపుష్పం నిర్వహించారు. బచ్చుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి, సూర్యభగవానునికి పూజలు నిర్వహించారు. అనంతరం సూర్యభగవానుడిని సూర్యప్రభ వాహనంపై నగర వీధుల్లో ఊరేగించారు.
వేకనూరు(అవనిగడ్డ): వేకనూరు సూర్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు కనుల పండువగా జరిగాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు.ఆలయ ధర్మకర్త తుంగల వీర వసంతరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



క్లుప్తంగా

నేడు నాగాయలంకలో విద్యుత్ సరఫరా నిలిపివేత

నాగాయలంక: నాగాయలంక గ్రామానికి శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని మండల విద్యుత్ శాఖ ఏఈ జి.ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు ఆటంకం కలిగిస్తున్న చెట్ల కొమ్మలను కొట్టడం, లైన్ల మరమ్మతులు చేపట్టిన దృష్ట్యా శనివారం ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని పేర్కొన్నారు.

నేడు 'పది' పబ్లిక్ పరీక్షలపై అవగాహన

పెడన: ఏపీ ప్రైవేట్ స్కూల్స్ ఆధ్వర్యంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు ఎ.గౌరీప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు పల్లోటి హైస్కూల్లో పెడన, మచిలీపట్నం, బంటుమిల్లి ప్రాంతాల ప్రైవేట్ విద్యాసంస్థల్లో అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ఘనంగా భావనరుషి కల్యాణం



పెడన: పట్టణంలోని పద్మశాలీ బహోత్తమ సంఘం ఆధ్వర్యాన స్థానిక 2వ వార్డులోని శ్రీభద్రావతి సమేత శ్రీభావనరుషి స్వామివార్ల కల్యాణ మహోత్సవం శుక్రవారం ఉదయం అంగరంగవైభవంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన సంబరాలు శుక్రవారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధనతో ముగిశాయి. నందం దుర్గావెంకట కోటేశ్వరరావు(నాని), శివపార్వతీ దంపతులు, వేదపండితులు అయిలూరి జైకిషోర్ శిష్యబృందం కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, పలువురు కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.
కోడూరు: కోడూరులోని భద్రావతి సమేత భావనరుషి స్వామివారి ఆలయంలో ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. రాత్రికి పులి వాహనంపై కల్యాణమూర్తులను ఊరేగించారు.

పెడన వీఆర్వోల సంఘ అధ్యక్షుడిగా గోవిందరాజులు



పెడన: వీఆర్వోల సంఘ పెడన మండల అధ్యక్షుడిగా పరసా గోవిందరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెడన తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం మండల వీఆర్వోల సమావేశం నిర్వహించారు. కృష్ణా జిల్లా జాయింట్ సెక్రటరీ ఎండీ మౌలాలి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెడన మండల వీఆర్వోల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా పరసా గోవిందరాజులు, వైస్ ప్రెసిడెంట్‌గా కట్టా వీరబాబు, గౌరవ అధ్యక్షుడిగా రుద్ర గనేశ్వరావు, కార్యదర్శిగా షాకిరుల్లా, జాయింట్ కార్యదర్శిగా అంకాలరావు, ట్రెజరర్‌గా భద్రం ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభం



మచిలీపట్నంటౌన్: నగరంలోని 33వ డివిజన్‌లో పక్కా డ్రెయిన్ నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 5.77 లక్షలతో 270 మీటర్ల మేర డ్రెయిన్‌ను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ నగరంలోని పలు డివిజన్లలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో సిమెంటు రోడ్లు, పక్కా డ్రెయిన్లు, పైప్‌లైన్లు నిర్మించారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, 33వ డివిజన్ కార్పొరేటర్ మీర్‌అస్గర్‌అలీ, ఇతర కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కాలువపై భారీ లోడులారీ.. కుప్పకూలిన వంతెన



రావివారిపాలెం(మోపిదేవి): రావివారిపాలెంలో 11/1 బ్రాంచి కాలువపై ఇసుక టిప్పరు భారీ లోడుతో వెళ్తుండగా వంతెన కుప్ప కూలిపోయింది. శుక్రవారం ఇసుక లోడుతో వచ్చిన టిప్పర్‌ను వంతెన దాటిస్తున్నారు. ఆ సమయంలో వంతెన కూలడంతో వెనుక చక్రాలు ఖాళీలో ఇరుక్కుపోయాయి. ఆ సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. పొక్లెయినర్‌తో ఇసుక దింపి, లారీని బయటకు తీశారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

కలెక్టర్ రాజాబాబు


వీసీలో కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి , డీఆర్వో చంద్రశేఖర్

చిలకలపూడి(మచిలీపట్నం): సాధారణ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కృష్ణా కలెక్టర్ పి.రాజాబాబు వెల్లడించారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా 2024 సాధారణ ఎన్నికల నిర్వహణపై శుక్రవారం సాయంత్రం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిలో కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మితో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 22న తుది ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం 21,880 ఫారం 6, 7, 8 దరఖాస్తులు వచ్చాయని వీటిలో 7,938 పరిశీలించగా 13,942 దరఖాస్తులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతుల ఏర్పాటు పనులను పూర్తి చేశామని వివరించారు. ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలీస్ అధికారులు, సిబ్బందికి ఇప్పటికే అవసరమైన శిక్షణ ఇచ్చామన్నారు. జిల్లాలో అన్ని చోట్ల నగదు, మద్యం అక్రమ రవాణ నివారణకు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సురక్ష నిర్వహణలో జిల్లా ప్రథమ స్థానం
జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండోదశ నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో సరాసరి ఓపీ వైద్య సేవలు అందించడంలో రాష్ట్రంలో కృష్ణా జిల్లా మొదటిస్థానంలో ఉన్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి శుక్రవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రీ-సర్వే, జగనన్న ఆరోగ్య సురక్ష, ఉపాధిహామీ తదితర అంశాలపై సమీక్షించారు. జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాలకు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు 171 క్యాంపులు నిర్వహించగా 85,692 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారన్నారు. ఒక్కొక్క క్యాంపులో సరాసరి 501 మందితో జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఆరోగ్యశ్రీ యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో 1,15,468 ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ కోసం సిద్ధంగా చేయగా ఇప్పటి వరకు 77,780 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా 68 లక్షల పనిదినాలు కల్పించే దిశగా అడుగులు వేస్తూ 66.90 లక్షల పని దినాలు ఇప్పటికే కల్పించామన్నారు. మూడో దశ రీ-సర్వే కార్యక్రమానికి సంబంధించి 130 గ్రామాల్లో ఫైనల్ ఆర్‌ఓఆర్ పూర్తి చేసినట్లు తెలిపారు. డీఆర్వో చంద్రశేఖరరావు, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, సర్వే ఏడీ వెంకటేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గీతాబాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయాల భవనాలు ప్రారంభం

కోడూరు: మండలంలో నిర్మించిన పిట్టల్లంక, సాలెంపాలెం సచివాలయ భవనాలను శనివారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. రూ.87.2లక్షల వ్యయంతో నిర్మించి భవనాలను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభిస్తారన్నారు.

జగనన్నపై ప్రజాభిమానాన్ని ఓర్వలేకే ప్రతిపక్షాల సైకో ప్రవర్తన

పెదప్రోలు(మోపిదేవి): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాభిమానాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు సైకోల్లా ప్రవర్తిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదప్రోలు ప్రధాన సెంటర్లో ఏర్పాటు చేసిన మా నమ్మకం నువ్వే జగన్ ఫ్లెక్సీ బోర్డును గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బ్లేడ్‌తో కోసి అందులో ట్యూబ్‌లైట్‌ను తస్కరించారు. కారకులను గుర్తించి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, పీఏసీఎస్ చైర్ పర్సన్ ఆది రాంబాబు, మండల ఎస్సీసెల్ కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, గ్రామ పార్టీ కన్వీనర్ జన్యావుల రామమోహనరావు తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేపు ముఖద్వారం ప్రారంభం



కోడూరు: ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామివారి దేవాలయ నూతన ముఖద్వారాన్ని ఆదివారం ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ శుక్రవారం తెలిపింది. రూ.10లక్షలతో గరుత్మంతుడి బొమ్మ సెంటర్‌లో ఈ ముఖద్వారం నిర్మాణం జరిగిందని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెడన: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి కోలుకోలేక మరణించిన ఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నందమూరు పంచాయతీ జయంతి కాలనీకి చెందిన పరసా ఏడుకొండలు(60) కాలనీ ప్రధాన రహదారి పక్కన నిలబడగా ద్విచక్ర చోదకుడు ఢీ కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఏడుకొండలును మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్సకు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకు వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మరణించారు. శుక్రవారం ఘటనపై కేసు నమోదైంది. పరసా రాధాకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామాన్యులకు ఆరోగ్య ప్రదాయిని జేఏఎస్


తలగడదీవి ఆరోగ్య సురక్ష శిబిరంలో మందులు అందజేస్తున్న దృశ్యం

తలగడదీవి(నాగాయలంక): సామాన్యులకు ఆరోగ్య ప్రదాయిని జగనన్న ఆరోగ్య సురక్ష అని సర్పంచి భోగాది వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయం ఆవరణలో శుక్రవారం తలగడదీవి, చోడవరం పంచాయతీల ప్రజలకు రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తొలుత శిబిరాన్ని సర్పంచి భోగాది వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ కె.అప్పలనరసమ్మ ప్రారంభించారు. ఎంపీడీఓ శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో 404మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. వీరిలో 59మందికి కంటివెలుగు, 11మంది గర్భిణులు, 36మంది పిల్లలు వైద్యసేవలు అందుకున్నారు. డాక్టర్లు శ్యామ్‌ప్రసాద్, తారకేశ్వరరావు, ఇంద్రకుమార్‌రెడ్డి, రాజశేఖర్, నేత్రవైద్యురాలు ఎం.శ్రీలక్ష్మి రోగులకు వైద్యపరీక్షలు చేశారు. స్థానిక గ్రామకార్యదర్శి బీవీ రమణ, వీఆర్వో కె.బి.రాజేంద్రప్రసాద్, సచివాలయాల సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.
ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): జగనన్న మెడికల్ క్యాంపు పేదలకు వరమని డాక్టర్ విజయ్ తెలిపారు. ఉత్తరచిరువోలులంక గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ డాక్టర్ శ్రీరాం సాయి మాట్లాడుతూ ఈ క్యాంపులో 498 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎంపీహెచ్‌వో బాబూరావు, సుధాకర్, మెడికల్ వైద్య సిబ్బంది, నర్సులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

తాగునీటి సమస్య లేకుండా చూడండి

బందరు మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అధికారులకు సూచించారు. మేయర్ వెంకటేశ్వరమ్మ శుక్రవారం నగరంలోని హెడ్‌వాటర్‌వర్క్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె చెరువుల్లో నీటి పరిమాణం, మోటార్లు, సంపులు, ఓవర్‌హెడ్ ట్యాంకులను పరిశీలించారు. వేసవిలో నీటి ఎద్దడి అధిగమించడానికి సిద్ధంగా ఉన్నామని ఏఈ సాయిప్రసాద్ ఆమెకు వివరించారు. పనిచేయని మోటార్లకు త్వరితగతిన మరమ్మతులు చేయించాలని ఆమె సూచించారు. ఈ పర్యటనలో మేయర్ వెంట డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, కో-ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసిఉన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్షలు


పరీక్షకు హాజరైన విద్యార్థులతో ఎన్‌సీసీ అధికారులు

మచిలీపట్నంటౌన్: ఎన్‌సీసీ సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్షలు శుక్రవారం స్థానిక నోబుల్ కళాశాలలో జరిగాయి. కృష్ణా యూనివర్సిటీ ఎన్‌సీసీ విభాగం విద్యార్థులతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల విద్యార్థులు 148 మంది హాజరయ్యారు. కృష్ణా యూనివర్సిటీ ఎన్‌సీసీ విభాగ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ డి.రామశేఖరరెడ్డి పరీక్షల విధానాన్ని పర్యవేక్షించారు. థియరీ పరీక్షలు ఈ నెల 18న విజయవాడలోని పీబీ సిద్దార్థ కళాశాలలో నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కృష్ణా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతూ రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న విద్యార్థిని టి. లక్ష్మీదమయంతిని 4వ ఆంధ్రా బెటాలియన్ అధికారి కల్నల్ బలీంద్రసింగ్, 16వ ఆంధ్రా బెటాలియన్ అధికారి సంసార్‌సింగ్ అభినందించారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దుర్గారమేష్ అనారోగ్యంతో మృతి



అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గుడిసేవ దుర్గారమేష్ (60) అనారోగ్యంతో మృతి చెందారు. రెండేళ్లుగా ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆయన అనారోగ్యానికి గురవడంతో కొంతకాలంగా విజయవాడలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించారు. గతంలో ఆయన ఇదే కళాశాలలో మ్యాథ్స్ అధ్యాపకునిగా పనిచేశారు. ప్రిన్సిపాల్ మరణంతో శుక్రవారం కళాశాలకు సెలవు ప్రకటించారు. కళాశాలలో దుర్గారమేష్ చిత్రపటానికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎన్వీ నరసింహారావు, అధ్యాపకులు ఎస్.దిలీప్, అన్నపరెడ్డి శ్రీనివాసరావు పూలమాలవేసి నివాళులర్పించారు.

పేదలకు అండగా జగనన్న

ఉప్పాల హారిక, రాము


రావిగుంట గ్రామంలో మాట్లాడుతున్న ఉప్పాల హారిక, రాము

బంటుమిల్లి: పేదలకు నవరత్న పథకాల ద్వారా ఆర్థిక అండను కల్పించింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము అన్నారు. ప్రజాదీవెనలో భాగంగా మండలంలోని మలపరాజుగూడెం, రావిగుంట గ్రామాల్లో శుక్రవారం వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాముతో కలిసి హారిక పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తులను కలిసి కరపత్రాలను అందజేస్తూ జగనన్న ముఖ్యమంత్రిగా మళ్లీ ఎందుకు కావాలో అవగాహన కలిగించారు. జగనన్న ముఖ్యమంత్రి కావాలంటే పెడన నియోజకవర్గంలో ఉప్పాల రాము ఎమ్మెల్యేగా గెలవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి రామును గెలిపించడంతో పాటు జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుని నవరత్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో పథకాలు పొందాలంటే ఎలాంటి ఇబ్బందులు పడ్డారో బాధితులకు తెలుసునంటూ పేర్కొన్నారు. అలాంటి బాధలు లేకుండా వలంటీర్ వ్యవస్థతో పథకాలు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ పాలడుగు బాబూరావు, సర్పంచులు దూసనపూడి అవతారం, భండారు చంద్రశేఖర్, ఎంపీటీసీ వీరబాబు, పార్టీ నేతలు కందుల నాగేశ్వరరావు, పాము పుష్ప, రాంకీ, రామకృష్ణ, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పెదకాలువపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన
మండల పరిధిలోని సాతులూరు పంచాయతీ శివారు సాతులూరు రేవు వద్ద బంటుమిల్లి ప్రధాన కాలువపై నిర్మించనున్న వంతెనకు ఉప్పాల హారిక, రాము శంకుస్థాపన చేశారు. రూ.12 లక్షల నిధులు వంతెన నిర్మాణానికి మంజూరయ్యాయి.

పేదలకు నివేశనా స్థలాలు ఇచ్చిన ఘనత జగన్‌దే

వైఎస్సార్ సీపీ బందరు ఇన్‌చార్జి పేర్ని కిట్టు


పట్టాను అందజేస్తున్న పేర్ని కిట్టు, డెప్యూటీ మేయర్ విజయలక్ష్మి తదితరులు

మచిలీపట్నంటౌన్: అర్హులకు ఇంటి స్థలాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ బందరు ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 23వ డివిజన్‌లో గురువారం రాత్రి నివేశనా స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలకు నివేశన స్థలం ఇవ్వటంతో పాటు పక్కా గృహ నిర్మాణానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేసి పేదలకు అండగా ఉన్నారన్నారు. గత టీడీపీ పాలకులు హామీలు ఇవ్వడమేగానీ పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదన్నారు. డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి మాట్లాడుతూ 23వ డివిజన్‌లో గతంలో పట్టాల పంపిణీ సమయంలో 19 మందికి పట్టాలు ఇచ్చినా సరైన స్థలం లేక రద్దు చేశామన్నారు. నేడు వారికి కరగ్రహారంలోని ఎఫ్ బ్లాక్‌లో నివేశనా స్థలాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ గూడవల్లి నాగరాజు, మాజీ కౌన్సిలర్ మాడపాటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

కూచిపూడి(మొవ్వ): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పామర్రు సీఐ వి.సుభాకర్, కూచిపూడి ఎస్ఐ టి శ్రీనివాస్ సూచించారు. మొవ్వ మండలం కూచిపూడి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్ల వాడకం అధికమైన నేపథ్యంలో సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. ప్రజలు తమ వ్యక్తి గత వివరాలను, డేటాను ఇతరులకు షేర్ చేయకూడదన్నారు. అలాగే సైబర్ నేరాలకు ఎవరైనా గురైతే 24 గంటల్లో 1930కు సమాచారం ఇస్తే నష్టపోయిన నగదు తిరిగి పొందే అవకాశం ఉందని తెలిపారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

గుడివాడ టౌన్: పౌష్టికాహారాన్ని తీసుకుని వ్యాయామం చేయడంతో హెచ్ఐవీని నియంత్రించవచ్చునని చైల్డ్ ఫండ్ ఇండియా మేనేజర్ కల్యాణ్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణా సంస్థ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ సంయుక్త ఆధ్వర్యంలో స్టిగ్మా రెడ్యుకేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హెచ్ఐవీ వైరస్ మనిషిలోని వ్యాధి నిరోధకశక్తిని తగ్గిస్తుందన్నారు. శక్తివంతమైన ఆహారం ద్వారా దాన్ని నియంత్రించవచ్చన్నారు.